www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 1 మార్చి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



నిర్మలాదేవి సేవలు ప్రశంసనీయం


ఉద్యోగ విరమణ చేసిన నిర్మలాదేవికి సత్కారం

ప్రజాశక్తి - కె.గంగవరం

నలభై సంవత్సరాలు ఉపాధ్యాయురాలిగా పనిచేసి, ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న సి.నిర్మలాదేవి సేవలు ప్రశంసనీయమని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. దంగేరు హైస్కూల్లో నిర్మలాదేవి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో డిఇఒ తదితరులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారులు పిల్లి రాంబాబు, ఎంవివి.సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకట సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి సభ్యురాలు ఒబిలినేని వరలక్ష్మి, సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరాశాజనకంగా బడ్జెట్

- ప్రధాన సమస్యలు పట్టని ప్రభుత్వం
- అరకొర కేటాయింపులకే పరిమితం
- అభివృద్ధిని విస్మరించిన వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 పూర్తి బడ్జెట్ను ఏపి అసెంబ్లీ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ బడ్జెట్ను మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రవేశపెట్టారు. అయితే ఈ బడ్జెట్ మరోసారి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లా అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విదిల్చలేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉంది. ధాన్యాగారంగా పేరు పొందింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. కేవలం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి భారీగా లెక్కలు చెప్పినప్పటికీ ఆశించిన స్థాయిలో ఖజానాలో సొమ్ములు లేవు. సంపద సృష్టిపై దృష్టి సారిస్తామని చెప్పినప్పటికీ 8 నెలలు గడిచిపోయినా ఉపాధి అవకాశాలు లేవు. భారీ బడ్జెట్లో భాగంగా రెవెన్యూ లోటును, ద్రవ్య లోటును పొందుపరిచారు. దీన్ని బట్టి ఈ లోటును పూడ్చడానికి ప్రజలపై భారీ ఎత్తున భారాలు మోపే అవకాశం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాను విస్మరించిన వైనం

ఈ బడ్జెట్ కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న సందర్భంలో ఈ బడ్జెట్పై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు గానీ, సాగునీటి పారుదల రంగానికి గానీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి బడ్జెట్లోనూ నిరాశే ఎదురయ్యింది. కొత్త ప్రభుత్వమైనా నిధులు కేటాయిస్తుందని ఆశించినా నిరాశే మిగిలింది. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపై కూడా కేటాయింపులు లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి ప్రస్తావన రాలేదు. గోదావరి పుష్కరాలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రహదారుల విస్తరణ వంటి పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావనె తీసుకురాలేకపోవడం గమనార్హం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాను కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు పూర్తిస్థాయిలో లేవు. వాటి అభివృద్ధిపై బడ్జెట్లో ఎటువంటి ప్రస్తావన కనిపించలేదు.



కీలక ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం గత 23 ఏళ్లుగా ఎదురు చూస్తున్న పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. గత వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఈ చిరకాల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం వాటా సొమ్ములు కేటాయిస్తుందని ప్రజలు ఎదురు చూశారు. కానీ బడ్జెట్లో ఆ ప్రస్తావనే రాలేదు. దాంతో నిరాశ తప్పలేదు.

పరిశ్రమలకు మొండి చేయి

కాకినాడ సెజ్లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వమైన పరిశ్రమలకు ఊతమిస్తుందని, తద్వారా ఉపాధి లభిస్తుందని యువత ఎంతో ఆశిస్తున్నప్పటికీ ఈ బడ్జెట్లో పరిశ్రమలకు మొండి చేయి చూపారని జిల్లాకి చెందిన నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లాకు వట్టి చేయి చూపడంపై పెదవి విరుస్తున్నారు. స్వయానా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో భాగంగా ఉన్న కాకినాడ సెజ్లో పరిశ్రమల ఏర్పాటుపై బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విస్మయకరమని పలువురు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు అరకొర నిధులను మాత్రమే కేటాయించారు. కాటన్ బ్యారేజ్ తూర్పు, మధ్య డెల్టాలోని కాలువల అభివృద్ధికి అధికారులు గతంలోనే రూ.70 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావన రాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల బాగుకు అరకొర నిధులే..

జిల్లాలో ఉన్న పలు రహదారులు గత వైసిపి ప్రభుత్వంలో అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిచోట్ల గుంతలను పూడ్చారు. దీంతో ప్రయాణికులకు కాస్త ఉపశమనం కలిగింది. శాశ్వత ప్రాతిపదికన రహదారులను నిర్మించాలంటే పెద్ద ఎత్తున నిధులు అవసరం ఉంది. ఈ బడ్జెట్లో రహదారుల కోసం అరకొర నిధులను మాత్రమే కేటాయించడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో సుమారు 250 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 4,200 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్లు, 1100 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 6,500 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు ఉండగా 60 శాతానికి పైగా మరమ్మతులకు గురై ఉన్నాయి.

నిరుద్యోగులకు నిరాశ

ఆంధ్రప్రదేశ్లో నిరుద్యోగ రేటు 17.5 శాతం ఉండగా వారికి నిరుద్యోగ భృతి కోసం వార్షిక బడ్జెట్ లో కేటాయింపులు చేయలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 3 లక్షల మందికి పైనే నిరుద్యోగులు ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాల కోసం గానీ, కనీసం నిరుద్యోగ భతిపై గానీ కేటాయింపులు లేవు. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున గొప్పలు చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కార్మిక, శ్రామిక, మహిళ, ఉద్యోగుల ప్రయోజనాలు కరువయ్యాయి. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు పూర్తిస్థాయిలో నిధులను కేటాయించకపోవడం విస్మయకరమని రాజకీయ విశ్లేషకులు ఆవేదన చెందుతున్నారు. ఉదాహరణకు అన్నదాత సుఖీభవకు రూ.10,400 కోట్లు అవసరం కాగా 6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రధానంగా నియోజకవర్గాలకు అభివద్ధి నిధులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించింది.

కౌలు రైతులకు ఊతమేదీ.?

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు ఐదున్నర లక్షల మంది కౌలు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అండడం లేదు. అయినకాడికి అప్పులు చేసి సాగు చేస్తున్నా పెట్టుబడి సొమ్ములు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు కనీసం ఈ బడ్జెట్లో కౌలు రైతుల ప్రస్తావనే తీసుకురాకపోవడం శోచనీయం. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సును అటకెక్కించారు. ప్రతినెలా మహిళకు రూ.1500 ఇస్తామన్నా బడ్జెట్లో ప్రస్తావించలేదు.


ఇవిఎంలు భద్రపరిచిన గొడౌన్ను పరిశీలిస్తున్న డిఆర్ఒ

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం


ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఇవిఎం)లు, వివి ప్యాట్ గోదాములకు భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం మూడవ అంతస్తులో భద్రపరిచిన ఇవిఎం మిషన్లు, వివిప్యాట్ గోదాములను శుక్రవారం జిల్లా రెవిన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి ఎన్నికల సంబంధిత అధికారులతో కలిసి తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల ప్రకారం ప్రతి నెల ఇవిఎం, వివిప్యాట్ గోదామును తనిఖీ చేసి, పరిశీలించిన అంశాలను ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపించాలని సూచించారు. అదే విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను పంపిస్తామని ఆమె వెల్లడించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో ఎన్నికల విభాగం ఉప తహశీల్దార్ శివరాజ్, డిప్యూటీ తహశీల్దార్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి


సూచనలిస్తున్న సివిల్ కోర్టు ఇన్ఛార్జి జడ్జి నాగేశ్వరరావు నాయక్

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక కోర్ట్ మార్చి 8న ఆవరణము నందు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఇన్ఛార్జి జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సివిల్ కోర్టులో పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోనేటట్లు చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కృషి చేస్తున్నదని అన్నారు. అందులో భాగంగానే లోక్ అదాలత్లు నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వాది, ప్రతివాదులు కాలయాపన చేయకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించు కోవాలని అన్నారు. అలాగే రాజీ పడదగిన క్రిమినల్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించు కోవాలన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

తాపీ మేస్త్రీల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి, - మండపేట

మండపేట పట్టణ తాపీ మేస్త్రీల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షునిగా పట్టణానికి చెందిన లేగా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తాపీమేస్త్రిల భవనంలో శుక్రవారం పట్టణ తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు అందరూ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా వంగా సత్తిబాబు, కార్యదర్శిగా నాయుడు రాంబాబు, సహాయ కార్యదర్శిగా సుంకర శ్రీనివాస్, కోశాధికారిగా కర్కోటి రాంబాబులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మెండు బాపిరాజు, షేక్ ఇబ్రహీం, గురుమళ్ల ఈశ్వరరావు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జుత్తుక సూర్యనారాయణ, ఏలూరి విజయశేఖర్, కోరుకొండ వీర్రాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లేగా సత్యనారాయణ మాట్లాడుతూ సంఘ అభ్యున్నతికి పాటు పడతానని, తోటి కార్మికులకు ఏ కష్టం వచ్చినా ముందుంటా నన్నారు. పట్టణంలో వేలాది మంది తాపీ మేస్త్రీలు ఉన్నారని వారందరినీ సభ్యులుగా చేర్చి సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. కార్యవర్గాన్ని భవన నిర్మాణ యజమానులు, భవన నిర్మాణ కార్మికులు అభినందించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



ఆలమూరులో సిద్ధార్థలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న స్కూల్ అధినేత ముల్లారావు

ప్రజాశక్తి - యంత్రాంగం

భౌతిక శాస్త్రవేత్త రామన్ ఎఫెక్ట్ కనుగుని భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతిని సాధించిన రోజును జాతీయ సైన్స్ డేగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల నమూనాల అందర్నీ అకట్టుకున్నాయి.

ఆలమూరు: మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని స్కూల్ అధినేత కె.ముల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించి, భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ చిత్రపటం కు పూలమాలవేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్త రామన్ ఎఫెక్ట్ కనుగుని భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతిని సాధించారని ఆయన కొనియాడారు. భారత ఖ్యాతిని నలువైపులా విస్తరించారని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం జరుపుకొని విద్యార్థులు తయారుచేసిన వివిధ నమూనాల మోడల్స్ ను ప్రదర్శించడం ఎంతో గర్వకారణంగా పేర్కొన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఆయన అభినందించారు. ముఖ్యంగా ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థుల ప్రదర్శించిన ఎర్త్ క్వేక్ అలారం, నీటి పరిశుద్ధత మోడల్, ఆటోమేటిక్ హౌస్ వైరింగ్, చంద్రయాన్, బ్లడ్ గ్రూప్స్, ప్లాస్టిక్ రీసైక్లింగ్, ట్రాఫిక్ సెన్సార్ మొదలైన నమూనాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ఎ.ఇందిరా నిర్మల, ఆర్.గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని రామచంద్రపురం పట్టణం లోని మోడరన్ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు, ప్రిన్సిపల్ సి.హెచ్. రాజేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం.రావు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సర్ సివి రామన్ అని, ఆయన రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన ఫిబ్రవరి 28న ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయం అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్రీయ దక్పథంతో ముందుకు సాగాలని,భవిష్యత్ లో ఉన్నత స్థానం సాధించి సమాజాభివద్ధికి కషి చేయాలని పేర్కొన్నారు. కాలేజీ సైన్స్ అధ్యాపకుల నేతత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, ఇంటర్మీడియట్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** : విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వడిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్డులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా శాస్త్రీయ దక్పథం ఏర్పడుతుందన్నారు. సర్ సివి.రామన్కు 1930లో భౌతిక శాస్త్రంలో వచ్చిన నోబెల్ బహుమతి ని పురస్కరించుకొని సైన్స్ డే గా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.చిట్టిబాబు, ఎన్.తులసి లక్ష్మి, జి సుజాత, పద్మనాభం మరియు విద్యార్థిని విద్యార్డులు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట**: విద్యార్థులు సరికొత్త ప్రయోగాలను రూపొందిస్తూ అన్ని విభాగాల్లోని రాణించాలని కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ అన్నారు. కొత్తపేట కాంతి భారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ డే సందర్భంగా ఎగ్జిబిషన్ ప్రారంభించారు స్కూలు కరస్పాండెంట్ తోట సత్యవేణి ఆధ్వర్యంలో విద్యార్థులు సుమారు 250 ప్రాజెక్టులు తయారు చేశారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను డిఎస్పి మురళీమోహన్ పరిశీలించారు ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన ఎక్స్ప్లేనేషన్ విని ఇన్నోవేషన్ బాగుందని భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ప్రయోగాలను రూపొందించాలని సూచించారు కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రావులపాలెం:** స్థానిక భాష్యం పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగ నమూనాలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, జోనల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థలో సైన్స్ డే



ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం


కొత్తపేటలోని కాంతి భారతి స్కూల్లో సైన్స్ నమూనాలను తిలకిస్తున్న డిఎస్పి సుంకర మురళీమోహన్



రావులపాలెం భాష్యం పాఠశాలలో సైన్స్ డే

కార్టూ'నిజం'



ప్రాంతీయ భాషలను మింగేస్తున్న హిందీ

ఘనంగా టైలర్స్ దినోత్సవం


కొత్తూరు సెంటర్లో విలియమ్స్ హో చిత్రపటం వద్ద టైలర్ల నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకుని జిల్లాలో టైలర్ల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఆలమూరు: కొత్తూరు సెంటర్లో జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడు జక్కంశెట్టి స్వామి ఆధ్వర్యంలో మండల శ్రీ వరసిద్ధి వినాయక టైలర్ల సంఘం ఈ టైలర్స్డే నిర్వహించారు. టైలర్లు విలియమ్స్ హోచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ టైలర్ల హక్కుల సాధన కొరకు అందరూ సమిష్టిగా పోరాడలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టైలర్లు కడలి వెంకటేశ్వరరావు, సూరంపూడి వెంకట రామారావు, మడికి రాంబాబు, వెల్ల వెంకట్రావు, శిరీష, నాగమణి, యశోవర్థిని, తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** రెడీమేడి రంగం వల్ల టైలర్ల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయని మండల టైలర్స్ సంఘం ఆందోళన వ్యక్తం చేశారు. విలియమ్స్ హో జయంతి సందర్భంగా మామిడికుదురు సెంటర్లో టైలర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఇంటి గణపతి రావు అధ్యక్షతన విలియమ్స్ హో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంటి వెంకటనారాయణ, వేండ్ర సత్యనారాయణ, నాగరాజు, తోట దుర్గాప్రసాద్, బళ్ళ రాంబాబు, పాటి సత్యనారాయణ, చుట్టగుల్ల కిషోర్, సప్పిడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో టైలర్స్ డే సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది టైలర్స్కు దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా టూత్ పేస్టులు, మౌత్ వాష్ లు పంపిణీ చేశారు. డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ దంతాలను రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా బ్రష్ చేసుకోవడం వల్ల పలు రోగాల క్రిముల నుంచి నోటిని సంరక్షించుకోవచ్చు అని వివరించారు. కార్యక్రమంలో ద్రాక్షారామ టైలర్స్ యూనియన్ సభ్యులు పిల్లి శ్రీను, పాలిక త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** అంతర్జాతీయ టైలర్స్ డే ను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లిలో టైలరింగ్ మిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆదరణ తగ్గి ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న టైలర్స్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. **రావులపాలెం:** ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా స్థానిక కళావెంకట్రావు జంక్షన్ లో శ్రీకాటందొర వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సూరంపూడి శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, పాలెపు ధర్మారావు, బొంతు నారాయణ, అప్పారావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాంబాబు, శ్రీను, కృష్ణ, సోమలింగచారి, మూర్తి, వెంకటరమణ, కుడుపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెంలో టైలర్స్ దినోత్సవం


మామిడి కుదురులో విలియమ్స్ హో విగ్రహం వద్ద టైలర్ల నివాళి


ద్రాక్షారామలో దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


గొల్లవిల్లిలో విలియమ్స్ హో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టైలర్లు

నేరాలు ఘోరాలు

ఆటో ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొన్న ఘటనలో ఒక అతను తీవ్ర గాయాల పాలైయ్యాడు. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయినాపురానికి చెందిన ఇళ్ళ సూర్య వెంకట నాగమల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం మోటార్ సైకిల్పై ఇంటికి వస్తుండగా బొండాయి కోడు తూము వద్ద అతనిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నాగమల్లేశ్వరరావు ను కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టి ఆటోతో పరారైన ఆటో డ్రైవర్ ను ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ శేఖర్

ఆలయంలో ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని సవరపాలెం శ్రీ సత్య నారాయణ స్వామి గురువారం రాత్రి ఆలయంలో చోరీ జరిగిందని శుక్రవారం అమలాపురం పోలీసులకు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. 8 కిలోల వెండి ఆభర ణాలు చోరీ అయినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు తాలూకా ఎస్ఐ వై.శేఖర్ బాబు, తాలూకా పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి డాగ్ స్క్వాడ్తో చుట్టుపక్కల ప్రాంతాలలో దర్యాప్తు చేపట్టారు.

అక్రెడిటేషన్ల గడువు మరో మూడు నెలల పొడిగింపు : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

మీడియా అక్రెడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మరో మూడు నెలల పాటు పొడిగించారని కాకినాడ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నుంచి జిల్లాకు సమాచారం అందిందన్నారు. ఈ నిర్ణయం మేరకు అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మార్చి 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు (లేదా) కొత్త కార్డులు జారీ చేయడం గాని ఏది ముందు జరిగితే అప్పటివరకు కార్డుల వ్యాలిడిటీని పొడిగించారన్నారు.

యానాం వార్తలు

మున్సిపాలిటీ స్థలంపై లెఫ్టినెంట్ గవర్నర్ కు ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మున్సిపాలిటీకి చెందిన 664 మీటర్ల స్థలం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుకు అమ్మడం సరికాదని,ఆ స్థలాన్ని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి దఖలు పరచాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్కు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎంఎల్ఎ వెలగా రాజేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్థలం 500 ఏళ్లుగా దేవస్థానం ఆధీనంలోనే ఉందన్నారు. ఇప్పటి వరకు ఆ స్థలాన్ని వాహనశాలగా ఉపయోగించినట్టు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు ఆ స్థలం అవసరం అన్నారు. ఆ స్థలం అమ్మడం సరికాదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన కాపీలను పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, పుదుచ్చేరి హెచ్ఆర్ఐ కమిషనర్కు పంపినట్టు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు టివిఎస్ఎస్వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు శాస్త్రవేత్తల వేషధారణలో అలరించారు. సైన్స్ నమూనాలను, శాస్త్రవేత్తల ఫోటోలను ప్రదర్శించారు. విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జ్ సిహెచ్.వీరభద్రం, ఉపాధ్యాయులు కె.క్రాంతి కుమార్, సిహెచ్.అశ్విని, పివి.వరలక్ష్మి, ఎం.ఉష రామలక్ష్మి, ఎం.రహిమా, ఐ.భాస్కరమని పాల్గొన్నారు. స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్లో చైర్మన్ నల్లం నాగబాబు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి - యానాం

శ్రీవిఘ్నేశ్వర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే 30వ వార్షికోత్సవాన్ని స్థానిక బెజవాడ గార్డెన్స్లో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఐ మునిస్వామి పాల్గొన్నారు. పలువురు వక్తలు టైలర్స్ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ తిక్కిరెడ్డి సత్యానందం మాట్లాడుతూ టైలర్స్ సంఘం అభివద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు రూ.2 లక్షలు ఇచ్చారన్నారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ రూ.2 లక్షల 25 వేలు ఇచ్చారన్నారు. సంఘ సభ్యులకు 5 కుట్టుమిషన్లు, అనారోగ్య బారిన పడిన టైలర్ రాచకొండ శ్రీనివాసరావుకు రూ.25 వేల సాయం అందించారన్నారు. సంఘ సభ్యులు నేమాల లక్ష్మీనారాయణ కనకాలపేట గ్రామ శివారులో 100 చదరపు మీటర్ల స్థలాన్ని సంఘానికి విరాళంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, మల్లాడి విష్ణుమూర్తి, చిక్కం కృష్ణారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మహాశివరాత్రి సందర్భంగా గొల్లవిల్లి జడ్పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఎఎస్ఆర్(అరిగెల శ్రీరంగయ్య) మెమోరియల్ డే అండ్ నైట్ జాతీయ వాలీబాల్ పోటీలు మూడో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు మెన్ జాతీయ వాలీబాల్ పోటీలతోపాటు ఉమెన్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడంతో ఉమెన్ వాలీబాల్ జట్ల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠాన్ని రేకెత్తించాయి. ఇండియన్ బ్యాంక్ (చెన్నై)-ఎంసిఒఇ (త్రివేండ్రం), ఇన్కంటాక్స్(అహ్మదాబాద్-గుజరాత్), ఇన్కంటాక్స్-హూపర్స్-జిఎస్ టి(ముంబై), బెంగళూరు-ఇన్కంటాక్స్(కేరళ)జట్ల మధ్య జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. క్రీడలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు రాజకీయ నాయకులు తరలివచ్చి వీక్షించారు. నాలుగు రోజులు పాటు నిర్వహిస్తున్న టోర్నమెంట్ విజయవంతానికి టోర్నమెంట్ గౌరవ అధ్యక్షులు ఎంఎల్ అయితాబత్తుల ఆనందరావు, టోర్నమెంట్ అధ్యక్షులు, జడ్పిటిసి మాజీ సభ్యులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్,ముఖ్య సలహాదారు టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, సంయుక్త కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, గుత్తాల సుభాష్ చంద్రరావు, కోశాధికారి గనిశెట్టి తాతాజీ,సాంకేతిక సలహాదారు ఉండ్రు సుబ్బారావు(రాజబాబు), కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ గొలకోటి ఫణీంద్ర కుమార్ కార్యవర్గ సభ్యులు కృషి చేస్తున్నారు.


ఫ్లడ్ లైట్ల వెలుతురులో తలపడుతున్న జట్లు


జిన్నూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సర్పంచ్ల సమాఖ్య మండల అధ్యక్షుడు చిన్నవరాజు

'జిన్నూరి'కి ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు, నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు రెండోసారి వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు.నంగవరం లోని వెంకటేశ్వరావు నివాసంలో వెంకటేశ్వరావును సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, చినగాడవిల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కామిశెట్టి ప్రభాకరరావు, పోలుమాటి రామకృష్ణ తదితరులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పదవి ద్వారా వైసిపి బలోపేతానికి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.


ఇఒ వీర్రాజు చౌదరికి రూ 2. లక్షల నగదు అందజేస్తున్న అన్నవరం తదితరులు

నూకాంబిక ఆలయ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు చేస్తున్న సాయం అభినందనీ యమని ఆలయ ఇఒ వీర్రాజు చౌదరి అన్నారు. ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన పారిశ్రామిక వేత్తలు వంకా అన్నవరం, వైట్ల కనకదుర్గారావు, తదితర పార్టనర్స్ కలసి రూ.2 లక్షలు శుక్రవారం ఇఒకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆలయానికి తూర్పు, పడమర దిక్కులల్లో రెండు వైపులా ప్రత్యేకంగా దాతల సహకారంతో గోపురాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వైట్ల శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.


మామిడి కుదురులో యువజన విభాగం కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి గొల్లపల్లి

'అనుబంధ సంఘాలతోనే పార్టీ బలోపేతం'

ప్రజాశక్తి - మామిడికుదురు

యువజన విభాగాల ద్వారా గ్రామాల్లో పార్టీ బలోపేతం అవుతుందని రాజోలు నియోజకవర్గం వైసిపి ఇన్ఛార్జి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శుక్రవారం రాజోలు నియోజకవర్గానికి చెందిన రాజోలు, మామిడికుదరు మండలాల యువజన విభాగం అధ్యక్షులు ఎన్నిక వైసిపి నాయకుడు కటకంశెట్టి ఆదిత్య ఇంటి వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గొల్లపల్లి మాట్లాడుతు యువజన విభాగం అనేది రాజకీయంగా చాలా బలమైన పాత్ర అని, గ్రామాల్లో గ్రూపులను ఏకం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలను కోరారు. అనుబంధ విభాగాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని ముందుకు తీసుకు వెళ్లే విధంగా చూడాలన్నారు. పదవులు తీసుకున్న నాయకులు పార్టీ కోసం కష్టపడి పనిచేయాల న్నారు.కార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజకుమారి శ్రీధర్, భూపతి రాజు సత్తిబాబు రాజు, కంచర్ల శేఖర్, పాటి శివకుమార్, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్, గుర్రం జాషువా, గుబ్బల మనోహర్ కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రభాకరరావు

ప్రజాశక్తి - మండపేట



నియామక ఉత్తర్వులు చూపుతున్న కామన

రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షునిగా కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఉత్తర్వులు జారీ చేసి నట్లు శుక్రవారం కామన తెలిపారు. నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మూడు సార్లు ఆయన ఎంఎల్ఎగా పోటీచేశారు. ఆరు సార్లు పిసిసి సభ్యులు గా పనిచేశారు. మూడు సార్లు ఎఐసిసి సభ్యులు గా భాద్యతలు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు.

92 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని ముత్యమల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరంలో 92 పశువులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ ఎడి ఒ.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. సమారా 50 మంది పాడి రైతులు కార్యక్రమాలకు హాజరయ్యారు. ద్రాక్షారామం పశు వైద్యులు డాక్టర్ ఎం.కృష్ణార్జున, వెల్ల పశువైద్యులు రామచంద్రరావు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల రైతులు, పశుసంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.


పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎడి రామకృష్ణ తదితరు లు

చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మహిళలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని తద్వారా ఆర్థికంగా ఎదగాలని జిల్లా పరిశ్రమల అధికారి శివరామ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం ఆత్రేయపురం వెలుగు కార్యాలయములో సూక్ష్మ చిన్న, మధ్యతరహ పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి ఎంఎస్ఎంఇ ఉద్యమ రిజిస్ట్రేషన్ పై విఓఎలకు, సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్రామన్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఎంఎస్ఎంఇలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.ఉద్యోగ అవకాశాలను అందించడం ద్వారా దేశం అభివృద్ధి చెంది, గ్రామీణ ప్రాంతాలను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయని తెలియజేశారు. పెట్టుబడి పరిమితి, నమోదు కోసం ప్రమాణాలు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాటిపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సోసిటీ, డిఆర్పి టి.ఈశ్వరరావు, వెలుగు ఎపియం, ఆర్.యండి.గంగాధర్, మండలములో ఉన్న పారిశ్రామిక వేత్తలు ముదునూరి వెంకట రాజు, గాదిరాజు ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్ను ఎపి శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్లో మైనార్టీల సంక్షేమాని రూ.5,434 కోట్ల నిధులను కేటాయించిన సిఎం నారా చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్కు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే మొదటిసారిగా అత్యధిక నిధులను మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రాష్ట్రంగా ఎపి నిలిచిందని షరీఫ్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ బడ్జెట్ ని కేటాయించేందుకు కృషి చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎమ్ఎమ్డి.ఫరూక్, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఎ షరీఫ్కు ధన్యవాదాలు తెలిపారు.

2న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట శ్రీ ఉషా క్లినిక్ బస్టాండ్ రోడ్డు నందు మార్చి2 న ఆదివారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరం నందు (ఎముకలు దడత్వం పరీక్ష), న్యూరోపతి పరీక్ష (షుగర్ పేషెంట్స్, కాలిమంటలు, తిమ్మిర్లు, నరాల బలహీనత), మూడు నెలల స్థాయి షుగర్ స్థాయి పరీక్ష), షుగర్ పరీక్ష, యూరిక్ యాసిడ్ పరీక్ష, కీళ్ల నొప్పుల పరీక్షలు చేస్తారన్నారు. సుమారు రూ.4 వేలు విలువ గల సేవలు అందించబడునన్నారు. అపాయింట్ మెంట్ కొరకు 95501 46484 నంబర్ సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు జిల్లాలోని రైతు బజార్లలో ప్రత్యేకంగా షాపుల ను కేటాయించి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆద్వర్యంలో జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రానున్న ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్ను రూపొందించడానికి వ్యవసాయం, హార్టీకల్చర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారుల తో కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శించిన స్టాల్స్ను కలెక్టర్ పరిశీలించి రైతులు ఏ విధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తు న్నారు. పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశం లో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో 2024 -25 ఆర్థిక సంవత్సరం లో 92 గ్రామాల్లో 22399 మంది రైతులు 22586 ఎకరాల్లో పూర్తిగా లేదా పాక్షికంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు వాడటం ద్వారా భూమి కాలుష్యం అయ్యి పురుగుమందులు వాడిన ఆహారం తినడం మూలంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి కలుషితం అవ్వకుండా ,ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కాపాడవచ్చన్నారు. ఏటీఎం మోడల్ ద్వారా 20 సెంట్లు భూమిలో 15 నుంచి 20 రకాల ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం జరుగుతుందని ఇలా పండించడం ద్వారా ప్రతి వారం రూ.500 నుంచి రూ.800 వరకు రైతులకు ఆదాయం లభిస్తుందని వ్యవసాయ అధికారులు కలెక్టర్కు వివరించారు. జిల్లా లో 256 మంది ఎటిఎం మోడల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్లో గత సంవత్సరం కంటే ఎక్కువమంది ప్రకృతి వ్యవసాయాన్ని చేసేలా గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల సమావేశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించి ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎక్కువమంది రైతులు ప్రకృతి వ్యవసాయని చేపట్టేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను జిల్లాలోని రైతు బజార్లు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా ప్రతి రైతు బజారులో ఐదు నుంచి పది షాపులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు కేటాయించాలన్నారు. ప్రతి గ్రామంలో 5 నుంచి 6 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా వాణిజ్య పంటలను పండించే విధంగా వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్లు, కూరగాయలు ఏ ఏ విధంగా పండించవచ్చునో సర్వే చేసి నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, పీడీ డిఆర్డిఎ డాక్టర్ శివ శంకర ప్రసాద్, రైతు సాధికార సంస్థ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తపేట

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి ఆ మేరకు కొత్తపేటలో ప్రభుత్వం జూనియర్ కళాశాల సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో సిఎస్గా అనిల్ కుమార్, డిఒగా పి.శ్రీనివాస్ తమ సేవలను అందించనున్నారు. శుక్రవారం సిఎస్ అనిల్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ సెంటర్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాల, కాంతి భారతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. తమ పరీక్ష కేంద్రంలో కేవలం జనరల్ స్టూడెంట్స్ మాత్రమే పరీక్షలు రాయనున్నారన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తమ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులను 9 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలో సిఎస్గా జి.మోజెస్ విజయసాగర్, డిఒగా జె. రాజబాబు, ఎసిఎస్గా కట్టా నాగమోహన్ వ్యవహరిస్తారు. తమ పరీక్ష కేంద్రం గురించి విజయసాగర్ తెలియజేస్తూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల, కాంతి భారతి జూనియర్ కళాశాల, సత్యం ఒకేషనల్ కళాశాల జానకి రామయ్య ఒకేషనల్ కళాశాల, చప్పిడి వారి పాలెం ప్లస్ టు కళాశాల నుంచి జనరల్ ఒకేషనల్ విద్యార్థులు వచ్చి పరీక్షలు రాస్తారని తెలిపారు మార్చి 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తమ పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.